క్లుప్తంగా

కండ్లకుంటలో శ్రీరామనవమి వేడుకలు



వెల్దుర్తి : మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కండ్లకుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ ఈడెబోయిన వెంకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మోదుగుల వెంకటరెడ్డి, పిన్నెల్లి లక్ష్మారెడ్డి, వెంకట లక్ష్మారెడ్డి, తంగిరాల శివారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

32 మంది వలంటీర్లు రాజీనామా



దాచేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా వలంటీర్లు రాజీనామా బాట పట్టారు. నగర పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో గురువారం 32 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. వలంటీర్లుగా తాము చేస్తున్న సేవ కార్యక్రమాలపై టీడీపీ, జనసేన దుష్ప్రచారాలు చేస్తున్నాయని, తీవ్ర మనస్తాపం చెంది వలంటీర్లుగా రాజీనామాలు చేస్తున్నామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కుమ్మక్కై కుట్రలు చేస్తున్నాయని, జగనన్నని మరోసారి సీఎం చేసేందుకు తామంతా కష్టపడి పని చేస్తామని చెప్పారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

పిడుగురాళ్ల : అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని పిడుగురాళ్ల అగ్ని మాపక అధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద అగ్నిమాపక ప్రమాదాల గురించి అవగాహన నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కే బాద్‌షా, బి. నరసింహారావు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం..ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిద్దాం



మాచర్ల రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల షెడ్యూలు విడుదలై నామినేషన్ ప్రక్రియ మొదలవడంతో నియోజక వర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సమిష్టిగా పని చేద్దామని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. గురువారం తహశీల్దార్ పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్లు స్వీకరణ 25 వరకు జరుగుతుందని, ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు ఐదుగురు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని చెప్పారు. 19న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపి అభ్యర్థి నామినేషన్లు దాఖలు చేసేందుకు అనుమతి కోరారని ఇరు పార్టీలకు ఐదుగురు చొప్పున మాత్రమే కార్యాలయంలోకి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉదయం 7 నుంచి రాత్రి 10గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద రూ. 2లక్షలు నగదు స్వాధీనం : అంతరాష్ట్ర చెక్‌పోస్టు అయిన నాగార్జున సాగర్ వద్ద ఫ్లెయింగ్ స్క్వాడ్ తనిఖీలలో రూ. 2లక్షల నగదు స్వాధీన పరుచుకున్నామని, వీరు సరైన ఆధారాలు చూపిస్తే నగదును అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి పల్లపురాజు, సిఐలు శరత్‌బాబు, సురేష్ కుమార్ తదితరులున్నారు.

జగనన్నకు అండగా మేము సిద్ధం

28 మంది వలంటీర్లు రాజీనామా

రెంటచింతల : పేద వర్గాలకు పెద్ద కొడుకుగా బాధ్యత తీసుకున్న సీఎం జగనన్నకు అండగా మేము సైతం సిద్ధమంటూ మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన 28 మంది వలంటీర్లు రాజీనామా చేసి పత్రాలను నోడల్ ఆఫీసర్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావుకు గురువారం అందచేశారు. రాజీనామా చేసిన వారిలో మన్నెం లక్ష్మి, గాలి అంజలి, ఇగులూరి శిరీష, నవులూరి అరుణ, ఇ. పాండురంగారెడ్డి, ఎం. నాగబాబు, ఎం. శ్రీనివాసరావు, ఎ. లక్ష్మయ్య, కె. రవి నాయక్, సీహెచ్ బాబు, గుంటి రాణి, గుర్రం సంధ్యారాణి, సీహెచ్ అశోక్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం



బీసీ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

- బీసీలకు ఆత్మవిశ్వాసం ఎక్కువ
- నమ్మితే కడదాకా కొనసాగిస్తారు
- ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల : వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. బీసీలకు ఆత్మవిశ్వాసం ఎక్కువ అని, నమ్మితే చివరి దాకా నమ్మకంగా ఉంటారని చెప్పారు. గురువారం జానపాడు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీసీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీలు ఇక్కడ లేరా. నెల్లూరు నుంచి అనిల్‌కుమార్ యాదవ్ ఇక్కడ పోటీ చేయాలా అని ఎంతో మంది అంటున్నారని, బీసీలు అన్ని చోట్ల ఉన్నారు కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నర్సరావుపేటలో పోటీ చేస్తున్నానని తెలిపారు. మా బీసీల వద్ద డబ్బులు లేకపోవచ్చు కానీ గుండె నిండా ఆత్మ విశ్వాసం, నమ్మిన వారి కోసం ఎంతకైనా పోరాడే మనస్తత్వం ఉందని తెలిపారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు గతంలో వైఎస్సార్‌సీపీలోనే ఎంపీగా గెలుపొందారని, టీడీపీలోకి చేరి గురజాల నియోజకవర్గాన్ని తానే అభివృద్ధి చేశానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. గురజాలకు మెడికల్ కాలేజీ తీసుకువచ్చింది ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అని, అందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాను కూడా నెల్లూరులో రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన అనుభవం ఉందని, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఎమ్మెల్యేకే చెందుతుందని, స్థానిక సమస్యలు ఎమ్మెల్యేకే తెలుస్తాయన్నారు. లావు అగ్రకులం కాబట్టి టీడీపీలో చంద్రబాబు అభ్యర్థిగా అవకాశం కల్పించారని, అదే బీసీ నేత జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరితే ఎక్కడా ఎమ్మెల్యే స్థానం కల్పించలేదని విమర్శించారు. డబ్బులున్నవారితోపాటు అగ్రకులాల వారికే చంద్రబాబు పదవులు ఇస్తారు తప్ప బీసీలు, ఎస్సీ, ఎస్టీలను ఎప్పటికీ అభివృద్ధి కానివ్వరన్నారు.

బీసీలంటే వైఎస్సార్‌సీపీకి బ్యాక్‌బోన్ : ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బ్యాక్ బోన్ అని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీల అభివృద్ధితోపాటు సామాజిక న్యాయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజలను జగన్ మోహన్ రెడ్డి సోమరిపోతులను చేస్తున్నారని చంద్రబాబు విమర్శించటం దుర్మార్గమన్నారు. పేదలు డబ్బులు లేవన్న కారణంతో పిల్లల చదువులు మధ్యలో అపుతారని సీఎం అమ్మ ఒడి ద్వారా ఆదుకున్నారని, ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. డ్వాక్రా మహిళలకు చేయూతనందించేందుకు రుణమాఫీ చేసి ఆర్థిక వెసులుబాటు కల్పిస్తే చంద్రబాబు ప్రజలను సోంబేరులను చేస్తున్నారనడం దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్ కొక్కెర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మున్సిపల్‌చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, నర్సరావుపేట ఎన్నికల పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ బచ్చే మేస్త్రీ, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, దాదినబోయిన ఏడుకొండలు, మేర సంఘం డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది కంభంపాటి కోటేశ్వరరావు, కౌన్సిలర్లు అన్నెం పద్మావతి, అజ్మీర శారద, ముక్కంటి, పలువురు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరయ్యారు.

అభివృద్ధికి పట్టం కడతాం

ముక్తకంఠంతో స్పష్టం చేసిన బీసీలు



బీసీల ఆత్మీయ సమావేశానికి హాజరైన అనిల్‌కుమార్ యాదవ్, కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల : అభివృద్ధికే పట్టం కడతామని బీసీలు ముక్తకంఠంతో తెలిపారు. పట్టణంలో గురువారం జరిగిన బీసీల ఆత్మీయ సమావేశానికి వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కాగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి బీసీ ఆత్మీయ సమావేశానికి భారీ సంఖ్యలో హాజరు కావడంతో ఓటు అభివృద్ధికి వేస్తారా, కులం చూసి వేస్తారా, మతం చూసి వేస్తారా, ధనం చూసి వేస్తారా అని హాజరైన బీసీలను సూటిగా ప్రశ్న అడగ్గా సమావేశానికి హాజరైన బీసీలంతా అభివృద్ధికే పట్టం కడతామని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించిన జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కడతామని స్పష్టం చేశారు. గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచిన కాసు మహేష్‌రెడ్డికి, సీఎం జగన్‌మోహన్ రెడ్డి పంపించిన నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

అభివృద్ధి చూసి ఓటు ఏస్తాం



తమ ఓటును అభివృద్ధిని చూసి వేస్తాం. ఎన్నో సంవత్సరాలుగా కనిపించని అభివృద్ధి ఈ ఐదేళ్లలో గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సమాజంలో సామాజిక న్యాయం కోసం నాంది పలికిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే అండగా ఉండి విలువైన ఓటు వేస్తాం.

– వేముల సాంబయ్య

మా ప్రాంతానికి మెడికల్ కాలేజీ వచ్చింది



పిడుగురాళ్ల లో డిగ్రీ కాలేజీ లేని ప్రాంతానికి వైద్యశాల, మెడికల్ కాలేజీ వచ్చింది. రోడ్లు విశాలమయ్యాయి. రైల్వే బ్రిడ్జిని పూర్తి చేశారు. టైలర్లకు ప్రతి సంవత్సరం 10 వేలు ఇస్తున్నారు. మాకు జగనే ముఖ్యమంత్రి కావాలి, కాసు మహేష్‌రెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపీగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించుకుంటాం.

– వెన్నం రామదాసు

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపిస్తాం



కుల, మత, పార్టీల విభేదాలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోంది. అన్ని వర్గాల వారికి సంపూర్ణ న్యాయం జరిగింది. అందుకే నా ఓటు జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ గుర్తు అయిన ఫ్యాన్‌పై వేస్తా.

– కొమెర శ్రీనివాసరావు

మా పిల్లల భవిష్యత్ కోసం జగన్‌నే కావాలి



మా పిల్లల భవిష్యత్ కోసం మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డినే రావాలి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే.అందుకే పిల్లల భవిష్యత్ కోసం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి గెలిచేలా ఓటు వేస్తా.

– శ్రీ లక్ష్మీ

సీఎం జగన్‌కు అండగా నిలబడాలి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి

మాచర్ల : సీఎం జగన్ మోహన్ రెడ్డి మహిళలకు ఎంతో మేలు చేశారని, అలాంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకుని ప్రతి మహిళ వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి అన్నారు. గురువారం మాచర్ల పట్టణంలోని 26, 27, 28, 29 వార్డులకు చెందిన కౌన్సిలర్‌లు షేక్ దస్తగిరి, షేక్ మస్తాన్, షేక్ సుభాని ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామి రెడ్డి, తురక కిషోర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పలపాటి జాని, కౌన్సిలర్లు కరిముల్లా, షేక్ సుభాని, రఫి, అబ్దుల్, షంషీర్, షేక్ సులేమాన్, అల్లావుద్దీన్, జాకీర్, రహమాన్, గులాం హుస్సేన్, మహిళా అధ్యక్షురాలు ఆదిరాల నాగమణి, ఆయా వార్డు కౌన్సిలర్లు గట్ల అరుణ, వేల్పుల గురవయ్య, శంకర్, భారీ స్థాయిలో పలువురు ముస్లింలు, మహిళలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

మాచర్ల రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి వారికి మానసికంగా ధైర్యాన్ని అందించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ఇంపాక్ట్ సంస్థ పనిచేస్తుందని ట్రైనర్ తాళ్ళ ఆదినారాయణ తెలిపారు. గురువారం మండలంలోని విజయపురి సౌత్, కొప్పునూరు, జెడ్పి పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎంతో మేధాశక్తి దాగుందని, ఇంపాక్ట్ ట్రైనింగ్ ద్వారా ప్రతిభను వెలికి తీసి మానసికంగా ధృఢంగా ఉంచేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు ధీటుగా అన్ని వసతులను ముఖ్యమంత్రి కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలంతా సహకరించాలి

–ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు



రెంటచింతల : ప్రజల్లో విశ్వాసం కల్పించే లక్ష్యంగా పోలీసు ప్రత్యేక బలగాలతో గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు తెలిపారు. మే 13న జరగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా మండల పరిధిలోని తుమ్మకోట, పాలువాయి, మిట్టగుడిపాడు, రెంటాల, మంచికల్లు గ్రామాలలో 40 మంది సీఏఎస్ఎఫ్ ప్రత్యేక దళాలు, మరో 60 మంది ఏఆర్ పోలీసు సిబ్బందితో గురువారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రాజు మాట్లాడుతూ ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు గ్రామ పురవీధుల్లో ఫ్లాగ్ మార్చ్ (కవాతు) చేస్తూ ప్రజలకు మనోధైర్యం కల్పించి వారు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ గాంధీరెడ్డి, గురజాల డిఎస్పీ పల్లపురాజు, కారెంపూడి సీఐ చిన మల్లయ్య, ఎస్ఐ కె. వెంకట నారాయణ రెడ్డి,మరో ఇద్దరు ఏఆర్ ఎస్ఐలు, 100 మంది ప్రత్యేక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో 144 సెక్షన్



మాచర్ల : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం 7 నుంచి రాత్రి 10గంటల వరకు పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు అర్బన్ సిఐ పి శరత్‌బాబు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు నలుగురికి మించి గుమికూడదని, ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేటు ఆస్థుల ధ్వంసానికి పాల్పడినా, అల్లర్లు చేసినా జైలుకు పంపుతామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు పోలీసు శాఖకు సహకరించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా కేసులు నమోదు చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీకే శాలివాహనుల మద్దతు



కరపత్రం ఆవిష్కరిస్తున్న వెంకటరామిరెడ్డి

కారెంపూడి : వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తామని ఏపీ కుమ్మరి, శాలివాహన యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపల్లి లలిత్ ప్రజాపతి పేర్కొన్నారు. మండలంలోని కాచవరం గ్రామానికి గురువారం విచ్చేసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని శాలివాహన యువసేన కార్యవర్గ సభ్యులు కలసి వైఎస్సార్సీపీకి తమ మద్ధతు ప్రకటించారు. ముఖ్యమంత్రి శాలివాహనులకు చేసిన మేలును వివరిస్తూ శాలివాహన యువసేన రూపొందించిన కరపత్రాన్ని వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. యువసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రజాపతి మాట్లాడుతూ కుమ్మర్ల అభివృద్ధి, సంక్షేమం కోసం కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

విజయం కోసం కష్టపడి పనిచేయాలి

ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్



గామాలపాడులో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ని కలిసిన గ్రామస్తులు

దాచేపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి. అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో గురువారం ఆయన పర్యటించి స్థానిక నాయకులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రతి ఇంటికి వె వెళ్లి చెప్పాలని, ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలన్నీ మళ్లీ సజావుగా అమలు జరగాలంటే మరోసారి సీఎంగా జగనన్నని చూడాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ప్రజలకు వివరించాలని అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. గామాలపాడు గ్రామ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, తాను ఈ గ్రామ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీ అభ్యర్థిని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ సంకురాత్రి వీరయ్య, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, ఉపసర్పంచ్ షేక్ పెదహుస్సేన్, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ చాప శేషయ్య, నరసింహారావు తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బహత్తర అభివద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మండలంలోని మందాడి గ్రామ నాయకులు మాజీ సర్పంచ్ పులి త్రినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడిపికి చెందిన తాళ్ళూరి వెంకయ్య, నాగభూషణంతో పాటు మరో 15 కుటుంబాల వారు టీడిపిని వీడి వైఎస్సార్‌సీపీలో గురువారం రాత్రి చేరారు. పార్టీలోకి చేరిన వారికి పిఆర్కే క్యాంపు కార్యాలయంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పిఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ బీసీ కుటుంబాలకు పలు పథకాలు ప్రవేశపెట్టి వారి పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. బీసీల కుటుంబాల అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి కృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భగభగమంటున్న రెంటచింతల

రెంటచింతలలో 44.7 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రత



జనసంచారంలేక నిర్మానుష్యంగా ఉన్న మాచర్ల-గుంటూరు రహదారి

రెంటచింతల : వేసవిలో మంటచింతలగా ప్రసిద్ధి చెందిన రెంటచింతల నిప్పుల కొలిమిగా భగభగ మండుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఏటా వేసవికాలంలో ఏరోజు ఎండ ఎక్కువ కాసినా రెంటచింతల ఉష్ణోగ్రత ఎంత అని అడగడం సహజం. గురువారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 44.7 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27.4 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఇక్కడ నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గ్రామస్తులు అల్లాడుతున్నారు. భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో ఇంట్లోంచి బయటకు రాలేక ఉక్కపోతకు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండుతున్న ఎండల నుంచి వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణీలు పలు అవస్థలకు గురవుతున్నారు. ఎండ తీవ్రత నుంచి కొబ్బరి బోండాలు, చెరకు రసం, పలు రకాల శీతల పానీయాలతో గ్రామస్తులు కొంత ఉపశమనం పొందుతున్నారు. భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో ప్రస్తుతం ఇక్కడ సుమారు 44 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో గ్రామస్థులు ఉదయం 10 గంటలు దాటితే ఆరుబయటకు రావడానికి జంకుతున్నారు. వ్యవసాయ, వివిధ పనులకు వెళ్ళే కూలీలు ఎండతీవ్రత తట్టుకోలేక 11 గంటలకల్లా ఇంటిముఖం పడుతున్నారు.

రెండు నామినేషన్లు దాఖలు

గురజాల : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మొదటి అంకం అయిన నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు రెండు నామినేషన్లు వచ్చినట్లు రెవెన్యూ డివిజన్ అధికారి, రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి సూచించారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున యర్రమోతు ప్రసాద్ రావు, నేషనల్ నవక్రాంతి పార్టీ తరపున ఆ పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

వంద మీటర్లు మేర 144 సెక్షన్ అమలు : నామినేషన్ల కేంద్రం అయిన రెవెన్యూ డివిజన్ కేంద్రంకు వంద మీటర్లు మేర 144 సెక్షన్ అమలు జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. 100 మీటర్ల మేర ఎవరూ గుంపులుగా ఉండరాదన్నారు. డీఎస్పీ పల్లపురాజు ఆధ్వర్యంలో సీఐ బాలకృష్ణ నేతృత్వంలో ఎస్ఐలు బి అనంత కృష్ణ, సుందర్ రాజన్‌లు బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్ కాంగ్రెస్‌కి కుమ్మరి శాలివాహనుల మద్దతు

పిడుగురాళ్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కుమ్మరులకు అందించిన సంక్షేమ పథకాలతో ఎదుగుదల ఉందని గురజాల నియోజకవర్గం కుమ్మరి సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కుమ్మరి, శాలివాహనులకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కుమ్మరుల అభివృద్ధికి, సామాజిక, రాజకీయ గుర్తింపుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు గొళ్లపల్లి లలిత్ ప్రజాపతి, నియోజకవర్గ అధ్యక్షులు గొళ్లపల్లి అనిల్, నియోజకవర్గ కుమ్మరి సంఘం నాయకులు కానుక్ల సురేష్, రాజవరపు శ్రీను, గొళ్లపల్లి వెంకటేష్, మణికంఠ, అమర్‌నాథ్, బద్రయ్య, తొగటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ



అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పాపయ్య

రెంటచింతల : మండల పరిధిలోని సత్రశాల వద్దనున్న ఏపి జెన్‌కో మండలంలోని సత్రశాల ఏపి జెన్‌కో టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ముందు ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ (ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె. పాపయ్య నేతృత్వంలోని బృందం గురువారం వాహనాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ మే 13 నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ, చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు చేపట్టి ఎన్నికల ప్రవర్తనా నియమాళిని పటిష్టంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఎన్నికల కోడ్ ఉన్నందున వాహనాల్లో పరిమితికి (రూ.10 వేలు) మంచి నగదు, మద్యం, బంగారం, వెండి, తదితర విలువైన వస్తువుల తరలింపును నియంత్రించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా గ్రామాల్లో ఎక్కడైనా ఎన్నికల నియమ నిబంధనలకు వ్యతిరేక పనులకు పాల్పడుతున్న విషయం తెలిస్తే ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి-విజిల్ యాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.